
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శనివారం 7 సెప్టెంబరు 2024





# అవిఘ్నమస్తు..

## - నేడు వినాయకచవితి - నవరాత్రులకు ముస్తాబైన మండపాలు








మండపాలకు వినాయక ప్రతిమలను తరలిస్తున్న భక్తులు



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 6: సర్వవిఘ్నాలు తొలగించేవాడే విఘ్నేశ్వరుడు.. పూజ కావచ్చు యాగం కానీ మొదట పెట్టేది గణపతి పూజతోనే. భాద్రపద శుద్ధచ వితి రోజున వినాయకుడు జన్మనక్షత్రమని, అదే రోజున గణాధిపత్యం పొందాడని పురాణాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం భాద్రపద మాసం శుక్లపక్ష చవితి రోజున వినాయకచవితిని దేశమంతా సంబరంగా చేసుకుంటారు. నవరాత్రులు విశేష పూజలందుకుంటాడు బొజ్జ గణపయ్య. ఈ క్రమంలో విభిన్న ఆకృతులతో గణపయ్య సిద్ధమవ్వగా.. పోలీస్, విద్యుత్ అధికారుల అనుమతులతో నవరాత్రి ఉత్సవాలు చేసుకోవడానికి గణేష్ భక్త ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యారు. గణపతి బప్పా మోరియా, జై గణేషా అంటూ గణనాథులను మండపాల వద్దకు తరలిస్తున్నారు. మండపాలను అందం గా అలంకిరించే పనిలో యువకులు హడావిడిగా ఉన్నారు.

### సందడిగా మార్కెట్లు

మరోవైపు చవితి పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. సిద్దిపేటతో పాటు ఆయా పట్టణాల్లోని దుకాణాలు కిటకిటలాడాయి. బుజ్జి వినాయకులనుకొనుగోలు చేస్తూ పత్రి తీసుకుంటూ జనాలతో రోడ్లన్నీ బిజీగా మారాయి. పండుగ సందర్భంగా పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. స్వీట్ల దుకాణాలు, మండపాల అలంకరణ దుకాణాలు రద్దీగా మారాయి.

### మట్టి ప్రతిమల పంపిణీ

పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మట్టి వినాయకుల పంపిణీ చేపట్టారు. దివ్యాంగులు తయారుచేసిన మట్టి వినాయక ప్రతిమలను సిద్దిపేట రైతుబజార్ వద్ద మనోచేతన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టివినాయకులను పూజించడటం వల్ల ప్రకృతిని కాపాడిన వాళ్లమవుతామని, పూజకు కూడా శ్రేష్ఠం మట్టివినాయకులే అని అసోసియేషన్ సభ్యులు సూచించారు. కాకతీయ టెక్నో స్కూలు విద్యార్థులు మట్టివినాయకుల ప్రతిమలు తయారుచేసి ఆకట్టుకున్నారు. మట్టి ప్రతిమలనే కాకుండా కూరగాయలు, నవధాన్యాలు ఉపయోగించి బుజ్జి గణపయ్యలను తయారుచేశారు. పర్యావరణం పట్ల చిన్నప్పటి నుంచే అందరికి అవగాహన ఉం డేలా విద్యార్థి దశ నుంచే నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి అభిప్రాయంవ్యక్తం చేశారు.



సిద్దిపేటలో చవితి పూజాసామగ్రిని కొనుగోలు చేస్తున్న జనం







దివ్యాంగులు తయారు చేసిన విగ్రహాల పంపిణీ



మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

# మట్టి గణపతులను పూజిద్దాం..

- కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేట కలెక్టరేట్ సెప్టెంబరు 6 : మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా ప్రజలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం రామచంద్రపురం వారి ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టి గణపతి ప్రతిమను కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ డైరెక్టర్ గౌతమికి జిల్లా కలెక్టర్ అందజేసి మాట్లాడారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నీటి వనరులు కలుషితం కావని తెలిపారు. జిల్లాలో సుమారుగా 2500 మట్టి గణపతి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులను అభినందించారు. అనంతరం సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ కలెక్టరేట్ సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

### ఎఫ్‌పీవోలు మార్కెటింగ్ రంగంలోకి వెళ్లాలి

ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)లు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలోకి వెళ్లాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కృషి కల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్‌తో కలిసి అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లికి చెందిన ప్రహర్ష, గండిపల్లికి చెందిన ప్రసిద్ధ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎఫ్‌పీవోలను బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు నేరుగా ఎలా బిజినెస్ చేయాలో కృషి కల్ప ఫౌండేషన్ నేర్పిస్తుందని చెప్పారు. హార్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఏఏ పంటలు వేశారు. ఎన్ని ఎకరాల్లో వేశారు.. ఎప్పుడు పంట చేతికి వస్తుందనే వివరాలను ఎఫ్‌పీవోలకు అందించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్య, డీఆర్డీఏ ఏపీడీలు, నాబార్డు డీడీఎం నిఖిల్ రెడ్డి, అక్కన్నపేట హెచ్‌వో కౌసల్య, ఏఈవోలు, ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పీవోల చైర్మన్లు, డైరెక్టర్లు, సీఈవో లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదపుటంచున తంగళ్లపల్లి చెక్‌డ్యాం!

- వరద ఉధృతికి కోతకు గురైన కట్ట

కోహెడ, సెప్టెంబరు 6 : కోహెడ మండలం మోయ తుమ్మెద వాగుపై తంగళ్లపల్లి, వింజపల్లి, రామచంద్రాపూర్, వరుకోలు గ్రామాల సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో చెక్‌డ్యాంకు రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వ్యయంతో నిర్మించింది. తంగళ్లపల్లి వాగుపై రూ.5కోట్ల వ్యయంతో 2022లో చెక్‌డ్యాం నిర్మాణం పూర్తిచేశారు. 2023లో వరద ఉధృతికి మట్టి కట్ట తెగిపోవడంతో అదనంగా నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. ఐదు రోజుల క్రితం కురిసిన వర్షానికి వాగు మళ్లీ పొంగింది. ఈ వరదలతో చెక్‌డ్యామ్‌కు సిమెంట్ కట్ట సమీపంలో వరద ప్రవాహం వల్ల భారీగా గండి పడి మట్టి కొట్టుకుపోయింది. మరమ్మతు చర్యలు చేపట్టకపోతే సిమెంట్ కట్ట గోడ కూలిపోయే ప్రమాదం ఉంది. నీటి పారుదలశాఖ అధికారులు పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతాంగం కోరుతుంది. గత కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టకపోవడం వల్లే వరదలు వచ్చిన ప్రతీసారి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తంగళ్లపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం వద్ద కోతకు గురైన కట్ట

# విపత్తి..

- రైతులకు 'పారావిల్ట్' బెంగ
- వైరస్ సోకడంతో ఆకులు ఎండిపోయి రంగు మారుతున్న పత్తి పంట
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు



అక్కన్నపేట మండలం రామవరంలో పత్తి చేనులో నిలిచిన నీరు

గజ్వేల్/అక్కన్నపేట, సెప్టెంబరు 6: జిల్లాలో పత్తి రైతులపై పారవిల్ట్ పిడుగుపడింది. ఈ యేడు వాతావరణ పరిస్థితులు అనుకూలించి, మంచి దిగుబడి వస్తుందనుకున్న రైతులకు భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రెండున్నర నెలలుగా ఆశలు రేపిన పత్తి పంటకు ఒక్కసారిగా వర్షం తీరని నష్టం చేసింది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా నల్లరేగడి భూముల్లో పంటలు ఇప్పటికే ఎర్రబడడంతో పాటు పారావిల్ట్ వైరస్ సోకింది. ఎర్రచెల్కా నెలల్లో కొంత పర్వాలేదు. ఈ పారావిల్ట్‌తో దిగుబడిపై భారీ ప్రభావం పడే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ యేడు ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించిన రైతులకు భారీ వర్షాల రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత పరిస్థితిలో రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలను పాటించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



రాలిన పత్తి పూత, కాయలు



మర్కుక్ మండలంలో పారావిల్ట్ బారిన పత్తిపంట

### రంగు మారుతున్న పంట

జిల్లాలో ఇటీవల కురిసిన వరుస, భారీ వర్షాల కారణంగా పత్తిచేలు రంగు మారుతున్నాయి. పారావిల్ట్ సోకిన పంట ఎరుపు లేదా గోధుమ రంగులోకి మారుతుంది. పత్తి పంట ఆకులు ముడుచుకుపోయి ఆయా రంగులోకి మారుతున్నాయి. నీరు నిల్వ ఉండే పొలాల్లో అత్యంత వేగంగా పారావిల్ట్ వ్యాపిస్తుంది. దీనిని సడెన్ విల్ట్ అని కూడా పిలుస్తారు. ఇది పంటను ఆశించే భౌతిక వైరస్ అని అధికారులు చెబుతున్నారు. అనేక తెగుళ్ల లక్షణాలను కలిగి ఉండడంతో పాటు ఆకులు రంగు కోల్పోవడం, ఎండిపోవడం ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. ఆకులు రంగు మారిన అనంతరం ఆకులోని, వేరులోని కణజాలం నిర్జీవమవడంతో పంట పూర్తిగా దెబ్బతింటుంది. ముఖ్యంగా ఈ వైరస్ ఏపుగా పెరిగే మొక్కలు, పై ఆకులు భారీగా ఉన్న మొక్కలు, పత్తి కాయలు ఉన్న మొక్కలు ఈ వైరస్‌తో పూర్తిగా దెబ్బతింటాయని అధికారులు చెబుతున్నారు.

### ఇప్పటికే రూ.60వేలు పెట్టుబడి పెట్టాను

- పొన్న కరుణాకర్, రైతు, రామవరం, అక్కన్నపేట మండలం



మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇప్పటివరకు రూ.60 వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టా. పత్తి పంట నీట మునిగి ఎర్రబారిపోయింది. పత్తిపూత, కాయలు నేలరాలాయి. ప్రభుత్వమే పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

### నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- గుండు నాగరాజు, వ్యవసాయాధికారి, గజ్వేల్



ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు తగ్గితేనే పత్తి పంట పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు. భారీగా కురుస్తున్న వర్షాలతో పంట పారావిల్ట్ బారిన పడుతుంది. ముఖ్యంగా పత్తి కాయలు, ఆకులు ముందుగానే రాలిపోవడం కాయలు విచ్చుకుపోవడం జరుగుతాయి. మొక్క కోలుకోవచ్చు కానీ దిగుబడి మాత్రం తగ్గుతుంది. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎదుగుదల దశలలో లేదా పొడి పరిస్థితులలో అవసరమైతే కానీ మొక్కలకు తరచుగా కానీ, అధికంగా కానీ నీరు పెట్టవద్దు. పంటను క్రమం తప్పకుండా గమనిస్తూ ఉండాలి. వర్షాలు తగ్గిన అనంతరం ఎకరాకు 19:19:19 లేదా 13:0:45 లేదా 200లీటర్ల నీటిలో పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలి. పోటాష్ ఎరువులు వాడవచ్చు. నత్రజని ఎరువులు వాడకూడదు. లీటర్ నీటికి మూడు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజం ఒక గ్రామును మొక్క మొదళ్లలో, మొక్క పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలి.



సిద్దిపేటలో కురుస్తున్న వర్షం

## జిల్లాలో పలుచోట్ల

# భారీ వర్షం

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 6: సిద్దిపేట జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వరుణుడు నాలుగురోజుల పాటు కాస్త విరామమివ్వగా.. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాల ఉంచి ఉపశమనం లభించింది అనుకుంటున్న తరుణంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వినాయక చవితికి ఏర్పాట్లు.. పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

# దుబ్బాకలో ఉద్రిక్తత

- ముత్యం, సోలిపేట విగ్రహాల ఏర్పాటుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల పోటాపోటీ యత్నం



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

దుబ్బాక, సెప్టెంబరు 6 : దుబ్బాక బస్టాండ్ వద్ద శుక్రవారం దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి, దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాల ఏర్పాటుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు యత్నించగా కాసేపు ఉద్రిక్తతకు దారితీసింది. దుబ్బాక బస్టాండ్ ఎదురుగా దివంగత మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేయాలని కాంగ్రెస్ పార్టీ వారు భావించారు. అదే స్థలంలో బీఆర్ఎస్ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ భావించింది. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేయనున్నట్లు బీఆర్ఎస్ నేతలు భావించి అదే స్థలంలో వారు కూడా రామలింగారెడ్డి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఆగ్రహించిన కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే బీఆర్ఎస్ నాయకులు వెళ్లిపోయారు. తమ నేత విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించామని, బీఆర్ఎస్ వారు భూమి పూజ ఎలా చేస్తారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసుకులు అక్కడికి చేరుకుని కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని, ఇరువర్గాలు ముందుగా అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచించారు. అనుమతి లేకుండా భూమిపూజ చేసిన బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు శాంతించారు.




భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

## జిల్లా స్థాయి బేస్‌బాల్ సెలక్షన్స్

గజ్వేల్, సెప్టెంబరు 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపికను నిర్వహించారు. బెస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నెంటూరు రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలో 47మంది బాలికలు, 75మంది బాలురు పాల్గొనగా, 18మంది బాలికలు, 18మంది బాలురను ఎంపిక చేసినట్లు రంగారెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుయాదవ్, కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ కాటరాయప్ప, విజయపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, పీఈటీలు వెంకటేశ్వర్లు, విజయరేఖ, రాజశేఖర్, మమత, విఠల్, విజయ్, మహేశ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో బేస్‌బాల్ కమిటీ సభ్యులు




# తండాల తండ్లాట..!

### అధ్వానంగా రోడ్లు.. వర్షం వస్తే రాకపోకలకు అంతరాయం

కంది, సెప్టెంబరు 6 : గిరిజన తండాలకు సరైన రోడ్లు లేక జనం నానా కష్టాలు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని వెంకట్రావు మక్తా తండా, తునికిల తండా పంచాయతీ పరిధిలోని గొల్లగూడ తండాలకు ఇప్పటికీ సరైన రోడ్లు లేవు. దాదాపు 400 మంది నివసిస్తున్న ఈ రెండు తండాల్లోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, పశువులు మేకల పెంపకం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఉన్నప్పటికీ ఆ తండాలకు కనీసం తారు రోడ్డు గతి లేదు. రాకపోకలకు వారి సొంత వాహనాలు లేదా కాలినడకనే సాగిస్తున్నారు. అయితే, మట్టి రోడ్లపై వర్షం కురిసినప్పుడు రోడ్లు మొత్తం బురదతో చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. చిరుజల్లు పడినా చాలు వెంకట్రావు మక్తతాండ, గొల్లగూడ తాండలలో నివసిస్తున్న ప్రజల వెన్నులో వణుకు పుడుతోంది. కారణం ఆ గ్రామాల్లో దాదాపు కిలోమీటర్ మేర ఉన్న మట్టి రోడ్డే. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డంతా బురద మయంగా మారి రాళ్లు తేలి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. గొల్లగూడెం నుంచి తునికిల తండా వరకు దారి మొత్తం గుంతల మయంగా మారుతుంది. ఆ తండాల్లో ఎవరికైనా జ్వరం వచ్చినా, తలనొప్పి, కడుపునొప్పులు వచ్చిన కూడా రాకపోకలు సాఫీగా లేక తాండాలోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక పోతే ఆ తండాల్లో పాఠశాలలు లేక దగ్గరలోని గ్రామాలకు విద్యార్థులు చదువుకోవడానికి వెళ్తున్నారు. వారు కూడా బురదతో నిండిన రోడ్లపైనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.



గుంతల మయంగా మారిన గొల్లగూడ తాండ రోడ్డు. (ఇన్‌సెట్లో) రాళ్లు తేలి గుంతల మయంగా కంది పరిధిలోని వెంకట్రావు మక్తా తాండ రోడ్డు

**వెంటనే రోడ్లు వేయించాలి..**



మా తండాకి వెంటనే రోడ్డు వేయించాలి. ఇప్పుడున్న గుంతలన్నీ మరమ్మతులు చేస్తే తాండావాసులకు రాకపోకలు మెరుగవుతాయి. వర్షం పడినప్పుడు ఈ రోడ్లపై వాహనాలు వెళ్లాలన్నా కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మా తాండ రోడ్డును బాగు చేయించాలి

- బానోత్ కుమార్ గొల్లగూడ తాండ

**గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్నాం..**



చిన్నపాటి వర్షానికి తండాకు వచ్చే రోడ్డు మొత్తం రాళ్లు తేలి గుంతలమయంగా మారుతుంది. వాన నీరు ఆ గుంతల్లో నిలిచి మా రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికా రులు వెంటనే స్పందించి మా తాండకు తారు రోడ్డు వేయించాలి.

- ఇస్లావత్ రమేష్, వెంకట్రావు మాక్తా తండా

# శిథిలావస్థకు ములుగు పీహెచ్‌సీ

- వర్షం పడితే నీరు కారుతున్న స్లాబ్
- ప్రహరీలేక లోపలికి వస్తున్న పశువులు

ములుగు, సెప్టెంబరు 6: పేదలకు వైద్యం అందజేయాల్సిన ఆస్పత్రికి జబ్బు చేసింది. భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే దుస్థితిలో ఉన్నది. భారీ వర్షం కురిస్తే కూలిపోతుందా అన్నట్లుగా తయారైంది. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు భయాందోళనకు గురవుతుండగా, వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ములుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీకి రెండున్నర దశాబ్దాల క్రితం సొంత భవనం మంజూరు చేయగా నిర్మాణం పూర్తయింది. మండలంతోపాటు, పరిసర గ్రామాల ప్రజలకు ములుగు పీహెచ్‌సీలో వైద్యం అందజేస్తున్నారు. పీహెచ్‌సీకి భవనం ఉన్నప్పటికీ నుంచి నేటి వరకు మరమ్మతుల కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. స్లాబు దెబ్బతినడంతో వర్షం వచ్చినప్పుడల్లా నీరు కారుతున్నది. ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ప్రహరీ కూడా సక్రమంగా లేదు. ఉన్న ఒక్క గేటు ఏనాడో విరిగిపోవడంతో పక్కకు పడేశారు. దీంతో పశువులు ఆస్పత్రిలో సంచరిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఆస్పత్రిలో రోగులకు, ఆస్పత్రి అవసరాలకు వినియోగించడానికి ఏర్పాటు చేసిన నీటి సంపు శిథిలావస్థకు చేరుకుంది. సంపుకు స్లాబులు లేక పోవడంతో పాత రేకులు ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరుకున్న పీహెచ్‌సీకి కొత్త భవనం నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అప్పటి వరకు పీహెచ్‌సీ భవవనానికి మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న చేరుకున్న ములుగు పీహెచ్‌సీ, అధ్వాన్నంగా తయారైన వాటర్ సంపు

**నిధులు విడుదల చేయాలి**



ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఆస్పత్రికి నిధులు మంజూరుచేసి మరమ్మతులు చేపట్టాలి. పీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- దీప్తి, ములుగు పీహెచ్‌సీ వైద్యాధికారి

# అంబేడ్కర్ భవన్ నిర్మాణం పూర్తయ్యేనా..!

- హరీశ్ చొరవతో నిధులు
- మరో రూ. కోటి కోసం ప్రతిపాదనలు
- నిధులు లేక ఆగిన పనులు

చేర్యాల, సెప్టెంబరు 6 : చేర్యాల పట్టణంలో చేపట్టిన అంబేడ్కర్ భవన పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. భవనం పూర్తికి సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. చేర్యాలను 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన సమయంలో అంబేడ్కర్ భవనానికి రూ.50లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలుచేసిన సందర్భంగా రూ.50లక్షలు మంజూరు చేయడంతో స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలోని స్థలాన్ని కేటాయించారు. సంబంధిత ప్రదేశం మట్టిస్వభావం అనువుగా లేకపోవడంతో మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకుని అదనంగా రూ.80లక్షలు కలిపి మొత్తం రూ.1.30కోట్లు మంజూరు చేయించారు. ఆగస్టు 9, 2021న శంకుస్థాపన చేసి పనులు మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ ఏడాదిన్నర ఆలస్యంగా పనులు చేపట్టారు. కానీ గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుస్లాబ్ దశవరకు మాత్రమే ఆ నిధులు పరిపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. దీంతో మరో రూ.1కోటి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. నిధులు మంజూరైతేనే పనులు ప్రారంభమై భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయచర్యల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈవిషయమై ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరుచేయించి పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.


అంసపూర్తి దశలో అంబేద్కర్ భవనం

**మంజూరైన నిధుల వరకు పనులు చేపట్టాం**

అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి రూ.1.30కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధుల వరకు పనులు పూర్తయ్యాయి. అదనపు, పెండింగ్ పనులకు మరో రూ.1కోటి మంజూరుకోసం ప్రతిపాదనలు పంపించం, కానీ ప్రభుత్వం మారడంతో పాటు సమయం పట్టడంతో మళ్లీ అంచనా వేసి ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది. - పంచాయత్‌రాజ్‌శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి

## దానంపల్లి-నర్మెట్ట రోడ్డు నిర్మాణం చేపట్టాలి

చేర్యాల, సెప్టెంబరు 6: చేర్యాల మండలం దానంపల్లి, నంగునూరు మండలం నర్మెట్టకు వెళ్లే 3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు మాదాసు మల్లేశం, బైటి రవీందర్, తాళ్ల సుధీర్, మంతపురి శ్రీకాంత్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీ కిరణ్‌కుమార్‌ను కలిసి రోడ్డు దుస్థితి వివరించారు. మట్టిరోడ్డు ఉండటంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. దీంతో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని పీఆర్ ఈఈని ఆదేశించారు.


వినతిపత్రం అందజేస్తున్ననాయకులు






## నకిలీ విత్తనాలతో మోసపోయా..

# న్యాయం చేయండి

● లేకుంటే పురుగుమందే దిక్కు అంటూ రైతు ఆవేదన



పురుగుల మందు డబ్బాతో రైతు కొమ్మరాజుల రమేష్

ధూళిమిట్ట, సెప్టెంబర్ 6: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసపోయా.. అధికారులు స్పందించి న్యాయం చేయాలంటూ మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన రైతు కొమ్మరాజుల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తన మొక్కజొన్న చేనులో వీడియోలో మాట్లాడుతూ గ్రామంలోని ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి తనకు కావాల్సిన కంపెనీ మొక్కజొన్న విత్తనాలను అడిగితే ఇవ్వకుండా.. వాటికంటే మంచి దిగుబడి వస్తుందంటూ నమ్మించి వేరే కంపెనీకి చెందిన నకిలీ విత్తనాలను అంటగట్టడాని తెలిపారు. మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ప్రస్తుతం చిన్న చిన్న కంకులు వచ్చాయని బోరుమన్నాడు. ఇప్పటికే వేసిన బోర్లు పడకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయిన తనను మరింత అప్పుల్లోకి నెట్టేశారని వాపోయాడు. మోసపోయిన తనను ఆదుకోవాలని, లేకుంటే ఆత్మహత్యే దిక్కు అంటూ పురుగుల మందు డబ్బాలు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు.

## 28న జాతీయ లోక్ అదాలత్

● ఎక్కువ కేసులు పరిష్కరించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 6 : రాజీయే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులకు వివరించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర అధికారులకు సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో ఈ నెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి భవానీచంద్ర మాట్లాడుతూ క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, న్యాయాధికారులు కె.జయంతి, సునీతా రవీంద్రారెడ్డి, రాధాకృష్ణ చౌహాన్, లక్ష్మణ్‌చారి, శాలిని, తేజశ్రీ, జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షంతో రైతులకు తీవ్ర నష్టం

● వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి



తూంకుంట గ్రామంలో రైతుల పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి తదితరులు

జహీరాబాద్, సెప్టెంబరు 6 : నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు పెద్దమొత్తంలో నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి తెలిపారు. శుక్రవారం మండలంలోని తూంకుంట గ్రామంలో ఆయన పంటపొలాలను పరిశీలించారు. రోజువారీగా పంటనష్టం వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. పంటపొలాల్లో వరదనీరు అలాగే ఉందని, సాధ్యమైనంత తొందరగా తొలగించుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారిలావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు రూ. 2 లక్షల విరాళం



చెక్కును కార్పొరేటర్ సింధూ భర్త ఆదర్శరెడ్డికి అందిస్తున్న భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 6 : రెండు తెలుగు రాష్ట్రాల వరద బాదితుల సహాయార్థం మాజీ ప్రొటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి విరాళం అందజేశారు. ఒక్కో రాష్ట్రానికి రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల విలువగల చెక్కులను జీహెచ్ఎంసీ 111 డివిజన్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డికి శుక్రవారం అందజేశారు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, కృష్ణకాంత్, అజీమొద్దీన్, గౌస్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి

● నీలం మధు ముదిరాజ్



వరద నీరు తొలిగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 6 : చిట్కుల్‌లోని కాలనీలు వరద ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామ పంచాయతీ పరిధిలో ముంపునకు గురైన పలు కాలనీలను శుక్రవారం ఉదయం ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఈవో కవితతో కలిసి పరిశీలించారు. రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. నీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించి పంపితే ప్రభుత్వం నుంచి నిధులు రప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

## పిడిగుపాటుకు ఎద్దు మృతి

కల్హేర్, సెప్టెంబరు 6 : సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలంపాడ్‌తండాలో పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందింది. వివరాల్లోకి వెళితే తండాకు చెందిన రాథోడ్ నెహ్రూనాయక్ శుక్రవారం తన ఎద్దులతో వ్యవసాయ పనుల కోసం చేనుకు వెళ్లి వాటిని ఒకదగ్గర కట్టేశాడు. దీంతో పిడుగు పడి ఒక ఎద్దు మరణించగా సమీపంలో ఉన్న నెహ్రూనాయక్, ఆయన తండ్రి కిషన్ నాయక్‌లు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్ పరిశీలించి పంచనామా చేసి తమకు నివేదిక ఇవ్వాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. నెహ్రూనాయక్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఉజలంపాడ్ మాజీ సర్పంచ్ శోభావతి శేరికార్, బీజేపీ జిల్లా నాయకుడు అరుణ్‌రాజ్ శేరికార్ కోరారు.







అడుగుగునా గుంతలే..



తారు ఆనవాళ్లు కనిపించనంతగా ధ్వంసమైన రోడ్డు

# నరకదారులు

- 50 కిలో మీటర్ల అంతర్రాష్ట్ర రహదారి ఛిద్రం
- అడుగుకో గుంత.. బురదమయం..
- సిరూర్ వంతెన రెయిలింగ్ ధ్వంసం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- తరచూ వాహన ప్రమాదాలు
- కన్నెత్తి చూడని ఆర్అండ్‌బీ శాఖ
- దశాబ్ద కాలంగా మరమ్మతులు శూన్యం

**ఇది అందోలు నియోజకవర్గం పరిధి గుండా వెళ్తూ... కర్నాటక, మహారాష్ట్రలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యంత ఆవశ్యమైన నిమ్జ్‌ను అనుసంధానించే రోడ్డు... అయితే ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అత్యంత దారుణంగా తయారైంది. మరమ్మతులు, నిర్వహణ లేకపోవడంతో సుమారు 50 కి.మీల దూరం ఎక్కడ చూసినా గుంతలు పడి, రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గోతుల్లో నీరు చేరి చిత్తడిగా మారింది.**

జోగిపేట, సెప్టెంబరు 6 : దశాబ్దాకాలంగా నిర్వహణ లేకపోవడంతో ఈ రోడ్డు అధ్వానంగా మారింది. వరుసగా కురిసిన భారీ వర్షాలకు ఈరహదారి పూర్తిగా ధ్వంసమైంది. మోకాలి లోతు గుంతలు పడడంతో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. అక్కడక్కడ చిత్తడిగా మారి ప్రయాణికులకు నరకరాన్ని చూపిస్తున్నాయి. ఒళ్లు హూనం కావడంతోపాటు వాహనాలు సైతం పాడవుతున్నాయి. చిల్వేర చౌరస్తా నుంచి గట్టుపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కిలోమీటర్‌కు కనీసం ఐదుకు తక్కువ కాకుండా ఈ పది కి.మీలలో సుమారు 70వరకు గుంతలున్నాయి. ముఖ్యంగా చేవెళ్ల, మేడికుంద, దేవునూర్‌గేట్, పోతులబొగుడ గేట్, బహిరన్ దిబ్బ, వట్‌పల్లి వద్ద భారీ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

### రోడ్డు ఆనవాళ్లు కనిపించనంతగా..

ముఖ్యంగా మంజీరా నదిపై గల గట్టుపల్లి-సిరూర్ బ్రిడ్జి అవల సిరూర్ వైపు నాలుగు కిలోమీటర్లు అత్యంత దారుణంగా మారింది. రాయికోడ్ మండలం సిరూర్ గ్రామ శివారులోని నుంచి రాయిపల్లి బ్రిడ్జి అవల గట్టు నుంచి మహబత్‌పూర్ శివారు వరకు నాలుగు కిలోమీటర్ల మేర తారు రోడ్డు అనే ఆనవాళ్లు లేకుండా పూర్తిగా ఛిద్రమైపోయింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.

ఈరోడ్డుగుండా ప్రయాణించడానికి వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. సుమారు మోకాలి లోతున్న గుంతల్లో లారీలు, బస్సులే దిగబడిపోతున్నాయంటే, కార్లు, ఆటోల పరిస్థితి ఊహించుకోవచ్చు. చిన్నిపాటి వర్షానికే సదరు మట్టి బురదగా మారి, బైకులు, కార్ల టైర్లు, స్లిప్ అయి కంట్రోల్ తప్పి పడిపోతున్నాయి.

### తప్పని అదనపు ప్రయాణం

ఈ రోడ్డు బాగలేకపోవడంతో పలువురు లారీ, ఇతర వాహనాల డ్రైవర్లు ప్రత్యామ్నాయంగా చిల్వేర -జోగిపేట-సంగారెడ్డి-జహీరాబాద్ మీదుగా ప్రయాణించడంతో సుమారు 90 కి.మీల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది.. ఇది పెరిగిన డీజిల్ ధరల వల్ల నష్టం వస్తుందని వాపోతున్నారు.



రోడ్డు గుంతలో నిలిచిన నీరు.



రహదారిపై పడిన గుంతలు

## అధ్వానంగా ఎన్‌హెచ్ 65



కోహీర్, సెప్టెంబరు 6 : కోహీర్ మండలంలోని మద్రి గ్రామ శివారు నుంచి దిగ్వాల్ గ్రామం మీదుగా కవేలి, చింతలఘట్టు చౌరస్తా, కొత్తూరు(డి) గ్రామం మీదుగా ఉన్న 65వ జాతీయ రహదారి గుంతల మయంగా మారింది. అయినా నేషనల్ హైవే హథారిటీ (ఎన్‌హెచ్ఎ) ఏం మాత్రం పట్టించుకోవడంలేదు. ఈ దారిగుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళుతూ ఉంటాయి. ఈ నేపథ్యంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషమై మునిపల్లి మండలం కంకోల్ గ్రామం వద్ద ఉన్న టోల్ గేట్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### ఆదమరిస్తే నదిలో మునుగుడే..



ఈరహదారి మంజీరా నది పైనుంచి వెళ్తుండడంతో వట్‌పల్లి మండలం గట్టుపల్లి, రాయికోడ్ మండలం సిరూర్ గ్రామాల మధ్య మంజీరా నదిపై వంతెన నిర్మించారు. దీనికి ఒక పక్క రెయిలింగ్ విరిగిపోయి రెండేళ్ల గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. ఏ మాత్రం డ్రైవర్లు ఆద మరిచినా వాహనం అదుపు తప్పినా నేరుగా మంజీరా నదిలోకి పడిపోవడం గ్యారెంటీ. ఇలా పలు వాహనాలు నీటిలో పడిపోయిన ఘటనలూ లేకపోలేదు. అయితే అదృష్టవశాత్తూ ఇప్పటి వరకూ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోయినప్పటికీ. ప్రమాదాల నివారణకు వెంటనే రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మెదక్‌ను అగ్రగామిగా నిలపాలి

**అధికారులు సమన్వయంతో పని చేయాలి**

**దిశ కమిటీ చైర్మన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు**



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు(ఇన్‌సెట్‌లో), హాజరైన అధికారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 6: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మెదక్ పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని దిశ కమిటీ చైర్మన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. దిశ కమిటీ చైర్మన్ హోదాలో ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తయిన రెండు పడకల గదుల ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీల్లో అవసరమైన చోట పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని సూచించారు. శానిటేషన్ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. చర్చించిన అంశాలపై నివేదికలు తయారు చేసి, పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీఈవో రాధాకిషన్, ఏడీఏ గోవింద్, డీపీవో, ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, మామిడ్ల జ్యోతి, అశోక్‌గౌడ్, డీసీహెచ్ఎస్ డా. శివదయాల్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

### పార్టీని బలోపేతం చేయాలి..

హత్నూర, సెప్టెంబరు 6: గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హత్నూర మండలం శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలుగుమీది పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశమై సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

### ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని వాళ్లు మోదీపై విమర్శలా..

మెదక్, సెప్టెంబరు 6: ఉక్రెయిన్- రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని నిలిపివేయడానికి మధ్య వర్తిత్వం వహించాలని రష్యా అధ్యక్షుడు స్వయంగా ప్రధాని మోదీని కోరుతున్నార, ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని వ్యక్తులు మోదీని విమర్శించడం వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పరోక్షంగా సీఎం రేవంత్‌ను దెప్పిపొడిచారు. శుక్రవారం మెదక్‌లోని కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గురుకులాల్లో విద్యాబోధన చేస్తున్న 6200 మంది టీచర్లను విధుల నుంచి ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వ అనాలోచిత చర్య అన్నారు. దీని వల్ల ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారికి ఉపాధి ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే వారిని విధుల్లోకి తీసుకోకపోతే బీజేపీ తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మెదక్ పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు విషయంలో జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెడికల్ కౌన్సిల్‌కి నివేదిక అందిందని తెలిపారు. త్వరలోనే హెల్త్ సెక్రటరీని కలిసి మెడికల్ కళాశాల ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన



అల్లాదుర్గం శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, సెప్టెంబరు 6 : వర్షంతో దెబ్బతిన్న పంటలను అల్లాదుర్గం వ్యవసాయశాఖ అధికారి రాజేష్ కుమార్ శుక్రవారం ఏఈవోలతో కలసి పరిశీలించారు. ఈ నెల 6న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కడగండ్లు అన్న కథనంపై స్పందించిన అధికారులు నష్టం వాటిల్లిన పంటను పరిశీలించారు. వర్షం తాకిడి నుంచి పంటలను రక్షించుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఆయన వెంట ఏఈవో అమృత్ ఉన్నారు.

## ఐఐటీహెచ్‌లో స్ట్రాటజిక్ ఏఐ ప్రోగ్రామ్

**వారానికి 16 గంటలకు క్లాసులు**

కంది, సెప్టెంబరు 6: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రొఫెషనల్ కోసం ఐఐటీహెచ్‌లో స్ట్రాటజికల్ ఏఐ (కృత్రిమ మేధ) ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వ్యూహాత్మక అప్లికేషన్‌ల సమగ్ర అవలోకనాన్ని అందించడానికి ఈ ప్రోగ్రామ్ రూపొందించారు. శని, ఆదివారాల్లో రోజుకు 8 గంటల చొప్పున రెండు రోజులకు 16 గంటల పాటు ఆన్‌లైన్ మోడ్‌లో క్లాసులు నిర్వహిస్తారు. ఇందుకు ఫీజు జీఎస్టీతో కలిపి రూ.10వేలు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఇచ్చారు. సెప్టెంబరు 15 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయి. వివరాలకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల, సెప్టెంబరు 6 : మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పోలీసులకు ఇచ్చిన ఫర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన బుచ్చెల్లి కుమార్(45) కొన్నాళ్లుగా మద్యానికి అలావాటు పడి కుటుంబాన్ని పోషించకపోగా, తాగడానికి డబ్బులు కావాలని గొడవపడుతున్నాడు. గురువారం రాత్రి కూడా అతిగా మద్యం తాగివచ్చి భార్య, కూతురితో గొడవపడ్డాడు. అనంతరం వారిద్దరిని ఇంట్లో నుంచి గెంటివేసి తలుపునకు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు.

## 285 మంది ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఆర్‌వో ఫారం అందజేస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవర్ధన్

నంగునూరు,సెప్టెంబరు 6 :ఎంబీఏ,ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ లో శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.గోవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా 285మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐసెట్ వెరిఫికేషన్ 8, 9 తేదీల్లో కూడా కొనసాగుతుందన్నారు.

# మూడు నెలల చిన్నారి మృతి

**ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతోనేనంటూ ఆందోళన**



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి మంజుల

కల్హేర్, సెప్టెంబరు 6 : ప్రథమ చికిత్స కేంద్రంలో మూడు నెలల పసిపాప మరణించిన సంఘటన కల్హేర్ మండలంలోని క్రిష్ణాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్ఎంపీ వైద్యుడు సక్రమంగా చికిత్స చేయకపోవడంతోనే తమ చిన్నారి చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వైద్యుడితోపాటు ఆయన ఇంటిపై దాడికి యత్నించారు. వివరాల్లోకి వెళ్లితే మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన బేగారి అనిల్, మంజుల దంపతుల కుమార్తె భానుప్రియ(3 నెలలు) నాలుగైదు రోజులుగా జలుబు, జ్వరం బారిన పడటంతో నిజామబాద్, కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడలలో వైద్యం చేయించారు. జలుబును తగ్గించేందుకు నెబిలైజర్ పరికరం సాయంతో శుక్రవారం ఆర్ఎంపీ వైద్యుడు ఎండీ బాలికకు చికిత్స అందించిన కొద్దిసేపటికే చిన్నారి మరణించింది. పాప మృతికి ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల సదరు వైద్యుడుపై దాడికి యత్నించారు. రెండు రోజులుగా చికిత్స చేస్తున్నాడని, నయం కాదని తెలిపితే తాము ఇతర పెద్ద ఆసుపత్రికి తీసుకుపోయేవారమని బాధితులు తెలిపారు. చికిత్స చేయడంలో తన తప్పు లేదని, ఎలాంటి ఇంజక్షన్లు, గ్లూకోజులు ఇవ్వలేదని ఆర్ఎంపీ వైద్యుడు తెలిపారు. చివరకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం వచ్చి బాధితులను సముదాయించారు.

## డయల్ 100కు 14 సార్లు కాల్

● వ్యక్తిపై కేసు నమోదు

కల్హేర్, సెప్టెంబరు 6: తల్లి తనకు భూమి ఇవ్వడం లేదని మద్యం మత్తులో డయల్ 100కు 14సార్లు ఫోన్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విసిగించడంతో పాటు న్యూసెన్స్ సృష్టించినందుకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి పోచాపూర్‌కు చెందిన దూదేకుల నహీం రెండు రోజులుగా సాయంత్రం పూట మద్యం తాగి, తల్లి తనకు భూమి రాసి ఇవ్వడం లేదని ఓ రోజు 6 సార్లు, మరో రోజు 8 సార్లు డయల్ 100కు కాల్ చేశాడు. దీంతో పోలీసులు అతడిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి, కేసు నమోదు చేశారు. ఎవరైనా డయల్ 100కు అనవసరంగా కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీని వల్ల అసలైన ఇబ్బందుల్లో ఉన్న వారికి నష్టం జరుగుతుందన్నారు.

## రైల్వే సమాచారానికి వన్‌స్టాప్ కాంటాక్ట్ 139

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వేలకు సంబంధించి అన్ని రకాల హెల్ప్‌లైన్‌లను ఏకీకృతం చేస్తూ 139 నంబరును వన్‌స్టాప్ కాంటాక్ట్‌గా ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఇకపై ప్రయాణికులు ఏదైనా సమాచారం, సహాయం కావాల్సి వస్తే నేరుగా 139 నంబరుకు ఫోన్ చేయవచ్చు. 139 హెల్ప్‌లైన్ ప్రస్తుతం 12భాషల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. రైళ్లకు సంబంధించిన ఏదేని సమాచారం/ఫిర్యాదు కోసం 139 నంబరుకు ఫోన్ చేసి ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) లేదా నేరుగా కాల్‌సెంటర్ ఉద్యోగితో నేరుగా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలనుకునే రైల్‌మదద్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు పంపవచ్చు. ప్రయాణంలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 139కు ఫోన్‌చేయవచ్చు. పీఎన్ఆర్ స్టేటస్ కోసం 1, రైలు షెడ్యూలు కోసం 2, సాధారణ ఫిర్యాదుల కోసం 3, టికెట్లు రద్దు, సొమ్మువాపసు వివరాల కోసం 4, దివ్యాంగులకు సంబంధించిన సమాచారం కోసం 5, విజిలెన్స్ సంబంధిత ఫిర్యాదుల కోసం 6 నొక్కాలి. రైల్వేల పనితీరుకు సంబంధించి నాణ్యతలేని సమాచారాన్ని సోషల్‌మీడియాలో రీల్స్, వీడియోలను ప్రసారం చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని అధికారులు వెల్లడించారు.

## రూ.41 కోట్లు మంజూరైనా తండాల బీటీ రోడ్ల పనులకు గ్రహణం

హుస్నాబాద్, సెప్టెంబరు 6: అత్యధికంగా గిరిజనులున్న హుస్నాబాద్ నియోజకవర్గంలోని తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన బీటీ రోడ్ల పనులకు మోక్షం కలుగడం లేదు. ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయినా రూ. 41 కోట్ల విలువైన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి 24 పనులకు రూ. 4.58కోట్లు మంజూరయ్యాయి. ఇందులో మూడు భవన నిర్మాణ పనులు కాగా మిగతా 21 పనులు తండాలకు సంబంధించిన బీటీ రోడ్లు. వీటికి రూ. 41 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో మూడు పనులు టెండర్ దశలో ఉండగా మిగతావి టెంటర్లు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నది.

### మార్చి వరకు పనులన్నీ పూర్తి చేస్తాం

వర్షాలతో పాటు ఇతర కారణాల వల్ల ఈ పనులు ప్రారంభం కాలేదు. ఇందులో కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే సంవత్సరం మార్చి నాటికి పనులన్నీ పూర్తి చేస్తాం. డిసెంబరు నెల వరకు 50 శాతం పనులు పూర్తి చేస్తాం.

- ఐటీడీఏ ఏఈ సురేందర్‌రెడ్డి

# ఏళ్లుగా ఎదురుచూపులే

- బీటీ రోడ్డు కోసం నిరీక్షిస్తున్న గ్రామస్థులు
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- ప్రభుత్వం మారడంతో నిలిచిన నిధులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 6: గోపులాపూర్- నారాయణరావుపేట మధ్య ఉన్న మట్టి రోడ్డు నాలుగు కిలో మీటర్ల పొడవు ఉంటుంది. గ్రామాల ప్రజలు, రైతులు బీటీ రోడ్డు వేయాలని అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు పలుమార్లు విన్నవించారు. ఆయన కృషితో మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ. 3.99 కోట్ల నిధులు మంజూరయ్యాయి. బీటీ రోడ్డు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాల్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఈ పనులను ప్రారంభించ లేదు. ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధులను నిలిపివేశారు. గోపులాపూర్ ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే 7 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిన వస్తున్నది. బీటీ రోడ్డు పూర్తి చేస్తే మూడు కిలో మీటర్ల దూరం భారం తగ్గనుంది.



గోపులాపూర్-నారాయణరావుపేట మట్టి రోడ్డు

### వర్షాకాలంలో తప్పని కష్టాలు

వర్షాకాలంలో మట్టి రోడ్డు బురదమయంగా మారి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలకు రోడ్డు గుంతలమయం కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బీటీ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

### సంవత్సరాల నిరీక్షణ



సంవత్సరాలుగా నిరీక్షిస్తున్నాం. మట్టి రోడ్డుతో ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. రోడ్డు మీద ఉన్న గుంతల కారణంగా ప్రమదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి బీటీ రోడ్డును నిర్మించాలి.

- లింగారెడ్డి, రైతు, నారాయణరావుపేట

### దూరభారం తగ్గుతుంది



నారాయణరావుపేట మండల కేంద్రానికి వెళ్లేందుకు దూర భారం తగ్గుతుందని మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. ప్రభుత్వం మారడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలి.

-సుధాకర్, గోపులాపూర్

## రోడ్డు ప్రమాదంలో గాయాలు.. యువకుడి మృతి

మర్కుక్, సెప్టెంబరు 6: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన కొండపోచమ్మ రిజర్వాయర్ వద్ద చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం నారాయణపూర్‌కు చెందిన పల్లీ చంద్రశేఖర్(34) గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కొండపోచమ్మ రిజర్వాయర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని వంటిమామిడి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

- రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



కొండపాక: జర్నలిస్టులను సన్మానిస్తున్న క్రియేటివ్ టీచర్స్ సభ్యులు

ములుగు/కొండపాక/సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 6: సమాజ సంక్షేమంలో, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న పాత్రికేయుల పాత్ర కీలకమైందని రోటరీక్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు సామల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ జర్నలిస్టుడే పురస్కరించుకుని రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నరసింహారెడ్డి, సెక్రటరీ మహదేవుని శ్రీనివాస్‌గౌడ్, ట్రెసరర్ సాయిరెడ్డి, సభ్యులతో కలిసి మండల పాత్రికేయులను ఘనంగా శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొడాలి చంటి, కరుణాకర్‌రెడ్డి, దాస జగదీశ్వర్, ఏనుగు బాపురెడ్డి, చిరంజీవి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండపాక మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో జర్నలిస్ట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులను సత్కరించారు. విద్యార్థులకు నేటి సమాజంలో విలేఖరుల పాత్ర అనే అంశం మీద ఉపన్యాసపోటీ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి పాశం నక్షత్ర, ద్వితీయ బహుమతి హేమ, తృతీయ బహుమతి పుల్ల ఐశ్వర్య అందుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లింగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముక్క రమేష్, సభ్యులు దయానంద్, సరస్వతీ, కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్: సమాజంలో జర్నలిస్టు వృత్తి విలువలతో కూడుకున్నదని, జర్నలిస్టుల పాత్ర సమాజంలో కీలకమైనదని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భైరి శంకర్ విద్యారణ్య ఆవాస, విద్యాలయం జోనల్ ఇన్‌చార్జి కాటం రవీందర్ అన్నారు. జాతీయ జర్నలిస్టు డేని పురస్కరించుకుని సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్ వద్ద అర్బన్ జర్నలిస్టులను సన్మానించారు. కార్యక్రమంలో ఆవాస విద్యాలయం చైర్మన్ కొమురవెల్లి శేఖరం, సరస్వతి శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు నరేష్, అకాడమిక్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు నవీన్ పాల్గొన్నారు.

### జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే 'పల్లా' సంతాపం

చేర్యాల, సెప్టెంబరు 6: తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అకాలమరణం పట్ల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా భువనగిరిలో జిట్టా బాలకృష్ణారెడ్డి మృతదేహంపై పూల మాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నంటి నిలిచి తెలంగాణ సంస్కృతి, సంపదను దేశవిదేశాల్లో చాటిచెప్పిన జిట్టా కృషి ఎనలేనిదన్నారు.

### చేర్యాలలో ఫ్రైడే డ్రైడే

చేర్యాల, సెప్టెంబరు 6: చేర్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో దోమలకు ఆవాసంగా మారిన నీటినిల్వలను తొలగించారు. మురుగునీరు లేకుండా శుభ్రం చేయించారు. చిత్తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ వేయించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఏడీఏకి ఘన సన్మానం

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 6: హుస్నాబాద్ డివిజన్ వ్యవసాయ అధికారి మహేష్ హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు బదిలీపై వెలుతున్న సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్‌కు చెందిన పలువురు ఫర్టిలైజర్స్ డీలర్లు, రైతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన ప్రభాకర్‌రావు, కాంతాల రాజేందర్‌రెడ్డి, నీల శేఖర్, డీలర్లు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత

గజ్వేల్, సెప్టెంబరు 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంకు చెందిన పంజాల లింగం మృతి చెందిన విషయం తెలుసుకున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 6: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలసి కొన్ని రోజులుగా సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 11 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరు పరచగా విచారణ చేసి 11 మందికి రూ.14,500 జరిమానా విధించారు.



## సహకార సంఘం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, సెప్టెంబరు 6: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని బేగంపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను శుక్రవారం కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావుతో కలిసి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మూతబడిన పెట్రోల్ బంక్‌ను గ్రామీణ ప్రాంత రైతుల సౌలభ్యం కోసం పునఃప్రారంభించడం అభినందనియమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు, సీఈవో శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో విధులు నిర్వహించాలి

- గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ పురుషోత్తంరెడ్డి



పాండవుల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

గజ్వేల్, సెప్టెంబరు 6: అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ పురుషోత్తంరెడ్డిల సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, ముట్రాజ్‌పల్లిలోని బరీచెరువును అధికారులతో కలసి శుక్రవారం సందర్శించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో కోఆర్డినేషన్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయకులు వెళ్లే రూట్ క్లియర్‌గా ఉండే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలో అన్ని ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. వారివెంట గజ్వేల్ సీఐ సైదా, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, విద్యుత్ శాఖ ఏఈ గంధం మారుతి తదితరులు ఉన్నారు.

- **హుస్నాబాద్ టౌన్:** వినాయక మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మండపాల నిర్వాహకులు సూచించారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్లను బ్లాక్ చేయకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, ఎస్ఐ తోట మహేశ్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, కోమటి స్వర్ణలత, చిత్తారి పద్మ, గోవిందు రవి, రాజు తదితరులున్నారు.
- **కోహెడ:** కోహెడ పోలీస్‌స్టేషన్‌లో గణేష్ మండపాల సభ్యులతో ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ.. గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు.

## ఉపాధ్యాయులే భవిష్యత్ నిర్దేశకులు

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, సెప్టెంబరు 6: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం 18 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏంఈవో దేశిరెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులు తోటి వారితో స్నేహపూర్వకంగా మెదలాలి'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు

గజ్వేల్, సెప్టెంబరు 6: విద్యార్థులు ఒకరితో మరోకరు స్నేహపూర్వకంగా మెదలాలని గజ్వేల్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ కృష్ణారావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పాఠశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. వారితో అధ్యాపకులు వేణు, సారంగపాణి, అమతుల్ బసీర్, రవీంద్ర, కేవీ నరసింహస్వామి, నరేందర్, ఈవో పిట్ల స్వామి, సూపరింటెండెంట్ కె.ఈశ్వర్‌ప్రసాద్, హాస్టల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంట పరిశీలన

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 6: మండలంలోని ఇటిక్యాల, ఆలిరాజుపేటలో పత్తి పొలాలను ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి వసంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఖలీల్, భాను ప్రకాష్, శరణ్య, సమత పాల్గొన్నారు.

# రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ

- ఈనెల 14న బైరాన్‌పల్లిలో నిర్వాహణ

దూళిమిట్ట,సెప్టెంబరు 6: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన మహోత్తర వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే సంస్మరణ సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. 14వ తేదీన వీర బైరాన్‌పల్లిలో నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభల కరపత్రాలను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు నిజాం, రజాకార్లకు, భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా దున్నేవానికే భూమి అని, వెట్టిచాకిరికి,బాని సత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అనేక మంది అమరులైయ్యారన్నారు. ఈ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూములను పంచి పెట్టి వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించిందన్నారు. వీర బైరాన్‌పల్లిలో 1948 ఆగస్టు 27న రజాకార్లు గ్రామంలోని అనేక మందిని పొట్టన పెట్టుకున్నారని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున పోరాటాలు చేశారన్నారు. దీంతో నిజాం రాజు తట్టుకోలేక భారత సైన్యాలకు లొంగిపోయి హైదారాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, నాయకులు మల్లయ్య, సత్యనారాయణ, ప్రసాద్, సిద్ధులు, ప్రభాకర్, రాజేందర్‌తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

## సమయపాలన పాటించాలి

- ఎంహెచ్‌ఎన్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఆనంద్



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఆనంద్

అక్కన్నపేట, సెప్టెంబరు 6: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంహెచ్‌ఎన్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి, కస్తూర్బా బాలికల విద్యాలయాంలో పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి రమ్య ఉన్నారు.

## సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి

- బీజేపీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి

వర్గల్, సెప్టెంబరు 6: బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వర్గల్ మండలంలో సభ్యత్వంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలల్లో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ఉద్యమంలా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌గౌడ్, సభ్యత్వ కన్వీనర్ తిరుపతి రెడ్డి, కో కన్వీనర్ నాగరాజు, నాయకులు బబ్బూరి రవీందర్ గౌడ్, బద్రీనాథ్ గుప్తా, నరేందర్‌రెడ్డి, రాజేశ్, రంగ జయమ్మ, నర్సింహులు, రవి, బుచ్చిరెడ్డి, నరిసింహాగౌడ్ ఉన్నారు.

## జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న డైరెక్టర్ రాజలింగం

కోహెడ, సెప్టెంబరు 6: మండలంలోని బస్వాపూర్‌లో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రాజలింగం మాట్లాడుతూ.. 2016లో నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ కోసం సంస్థ స్థాపించామన్నారు. శిక్షణ సంస్థ ద్వారా ఇప్పటివరకు వివిధ విభాగాల్లో 4 వేల మందికి పైగా ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. ఇందులో మహిళలకు బ్యూటీ పార్లర్ లాంటి వాటిలో, పురుషులకు సీసీ కెమెరాలు, ఏసీ, టు వీలర్ రిపేరింగ్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ జె తవుడు, మహిళలు ఉన్నారు.

## రాష్ట్ర పీసీసీ నూతన అధ్యక్షుడికి మంత్రి 'పొన్నం' శుభాకాంక్షలు

హుస్నాబాద్/కుకునూరుపల్లి, సెప్టెంబరు 6: రాష్ట్ర కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియామకమైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఎస్‌యూఐ నుంచి చాలా కాలంగా పార్టీలో పని చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదగడం ఆనందనీయమన్నారు.

రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం సమర్థిస్తూ కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేందర్‌లు హర్షం వ్యక్తం చేశారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రానున్న 20 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు.

## తెలంగాణ భాషాత్మక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 6: రాష్ట్ర భాషను ప్రసారమాధ్యమాలకు, పత్రికలకు, పాఠ్యపుస్తకాలకు అనువర్తితం చేసి, ఆచరణలో పెట్టినప్పుడే స్థానికభాష అస్థిత్వం నిలబడుతుందని భాషాకారుడు బూర్ల వేంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఈ నెల 9న కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిద్దిపేట డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అధ్వర్యంలో తెలంగాణ భాషాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు తెలంగాణ వేరుకాదని, మన భాషాలో ఉర్దూ భాషా కలుస్తుందనేది కేవలం పట్టణాలకు మాత్రమే పరిమితమవుతుందని, పల్లెల్లో అచ్చమైన తెలంగాణ భాషనే వాడుకలో ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, తెలుగు విభాగాధిపతి మట్టా సంపత్ కుమార్, అధ్యాపకులు మధుసూదన్, గోపాలసుదర్శనం, శ్రద్ధానందం, ఎన్. సుమలత, వెంకటరమణ, చక్రహరిరమణ, సంపత్‌కుమార్, రామాస్వామి, నరేష్, శైలజ, నర్సింహులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల మంజూరుకు మంత్రి కృషి

కోహెడ, సెప్టెంబరు 6: మండలంలోని తంగళ్లపల్లిలో జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు మీద ఉన్న 18 విద్యుత్ స్తంభాలను సవరించాలని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యుత్ అధికారులకు ఆదేశించారు. ట్రాన్స్‌కో శాఖ అధికారులు విద్యుత్ స్తంభాల మార్పుటకు ప్రతిపాదనలు తయారుచేసి శుక్రవారం మంత్రికి అందజేశారు. తంగళ్ళపల్లి, శనిగరంలో రహదారిపై విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ప్రతిపాదనకు కలెక్టర్ మను చౌదరి నిధులు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. సమస్య త్వరగతిన పరిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

# మట్టి గణపతులనే పూజిద్దాం

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 6: మట్టి గణపతులనే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గజ్వేల్ మండల కుమ్మర సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఆయనవెంట కుమ్మర సంఘం నాయకులు నాగపురి రమేశ్, నాగపురి బాబు, నాగపురి చంద్రం, కొలిచెలిమే స్వామి, పోచయ్య, రవి ఉన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు మట్టి విగ్రహాలను మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య మున్సిపల్ వైస్ చైర్మన్ జకియోద్దిన్, కౌన్సిలర్లు ఉప్పలమెంటయ్య, తలకుక్కల భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, గంగిశెట్టి చందన రవీందర్, మామిడి విద్యారాణి శ్రీదర్, సీర్ల శ్యామల మల్లేష్‌యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, మున్సిపల్ సిబ్బంది, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

- **కుకునూరుపల్లి:** తిప్పారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మట్టి గణనాథులను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రవి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి ఉన్నారు.
- **మద్దూరు:** మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మట్టి గణపతులను ఎంపీడీవో రామ్మోహన్ అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాదవ్ మాధవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, నిర్మల, ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి, స్వయం సహాక సంఘాల సభ్యులు జయమ్మ, సబితా ఫీల్డు అసిస్టెంట్ అయిలయ్య, గణేష్, పాల్గొన్నారు.
- **చేర్యాల:** వినాయక చవితిని పురస్కరించుకుని ఆర్య వైశ్య మహసభ చేర్యాల కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా కార్యదర్శి తడక లింగమూర్తి, పట్టణాధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, కార్యదర్శి ఉప్పల నాగరాజు, కోశాధికారి తేరాల శ్రీనివాస్, యువజనసంఘం అధ్యక్షుడు ఒరుగంటి శ్రీకాంత్, నాయకులు మంచాల అంజనేయులు, పిన్న వీరమల్లయ్య, వెలిదె వాసు, శ్రీను, పిన్న రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: మట్టి వినాయకుడిని ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీడీవో రామ్మోహన్



మద్దూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పుష్పలత

మద్దూరు/కొండపాక/సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 6 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సలాఖ్‌పూర్‌లో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకలోపాలను అధిగమించాలని సూచించారు. ఇందుకు గ్రామాల్లో చౌకగా లభించే ఆకుకూరలు, తాజా కూరగాయలలో మంచి పోషకాలుంటాయన్నారు. పాలు, గుడ్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, హెచ్‌ఎం, ఏఎన్‌ఎం, అంగన్ వాడీ కార్యకర్తలు సరోజన, రాజమ్మ పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో రామ అన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా పోషకాహార సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికహారం అందించడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని పంచాయితీ కార్యదర్శి అరుణ సూచించారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది అంగన్‌వాడి కేంద్రం-2 లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్త పిట్ల రేణుక, సీఆర్‌పీ లావణ్య, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## 10 నుంచి 13 వరకు మండలస్థాయి క్రీడలు

- ఎంఈవో దేశిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 6: ఈనెల 10 నుంచి 13 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడల పోటీలు హుస్నాబాద్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి దేశిరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రావుల శ్రీనివాస్, పీడీ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 14 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగంలో క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి గల క్రీడాకారులు తమ పేర్లు, వివరాలను ఈనెల 10 లోగా ఆయా విభాగాల పీడీ, పీఈటీలకు తెలియజేయాలని కోరారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- తొగుట సీఐ లతీఫ్



మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

తొగుట, సెప్టెంబరు 6: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. గురువారం రాత్రి తొగుట మండలం చందాపూర్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనువిప్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అట్టి వారికి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంతరావు, చందాపూర్ మాజీ సర్పంచ్ నర్సింహులు, పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమలయ్య, భార్గవి, రవీందర్, గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'విద్యాభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాం'



సామగ్రిని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గజ్వేల్, సెప్టెంబరు 6: విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తలకొక్కుల చంద్రకళ-లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పాఠశాలకు మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాలు, స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు దుర్గాప్రసాద్, మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు కరీమోద్దీన్, ఉపాధ్యాయులు టీవీఎస్ లక్ష్మి, కోదండరామశర్మ, తవుటి బాలుచరణ్, ఉపాధ్యాయులు ఉన్నారు.